క్లుప్తంగా

విత్తన దుకాణాల తనిఖీ



విస్సన్నపేట: మండలంలోని విత్తన డీలర్ల దుకాణాలను విస్సన్నపేట వ్యవసాయ సహాయ సంచాలకులు శశికళ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నందున రైతులకు అవసరమైన అన్నిరకాల విత్తనాలను సిద్ధంగా ఉంచాలని, కొరత రానీయవద్దని ఆమె ఆదేశించారు. నాసిరకం విత్తనాల అమ్మకం, రశీదు ఇవ్వకుండా రైతుల్ని ఇబ్బంది పెట్టడం తగదని, ఇటువంటి చర్యలకు పాల్పడే డీలర్లను ఉపేక్షించేది లేదన్నారు. విత్తనాల స్టాక్ బోర్డు, ధరల పట్టిక బహిరంగంగా ప్రదర్శించాలని ఆదేశించారు. వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ముసునూరు: ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని దశదిశలా చాటి చెప్పిన ఘనుడు నందమూరి తారక రామారావు అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని వేల్పుచర్లలో టీడీపీ వ్యవస్థాపకుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహాన్ని గురువారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం



జగ్గయ్యపేట అర్బన్:జూన్ నెల 21 వ తేదీన అంతర్జాతీయ యోగా డే సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జగ్గయ్యపేట మున్సిపల్, సచివాలయ సిబ్బందికి గురువారం యోగాసనాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం, వార్డుల సచివాలయాల సిబ్బందికి యోగా గురువులు యోగాసనాలను నేర్పించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు మాట్లాడుతూ నేటి యాంత్రిక సమాజంలో యోగా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుందని చెప్పారు. యోగాసనాల వలన శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. ముఖ్యంగా ఏకాగ్రత పొందవచ్చునన్నారు.

డివిజన్‌లో 177.8 మి.మీ వర్షపాతం నమోదు

నందిగామ రూరల్:నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో బుధవారం 177.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు డివిజినల్ ఉపగణాంకాధికారి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ నియోకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 89.4 మి.మీల వర్షం కురవగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 88.4 మి.మీల వర్షం కురిసిందన్నారు. నందిగామ మండలంలో 36.6 మి.మీ వర్షపాతం నమోదవగా కంచికచర్ల మండలంలో 12.8 మి.మీ, చందర్లపాడు మండలంలో 15.8 మి.మీ, వీరులపాడు మండలంలో 24.2 మి.మీల వర్షపాతం నమోదైందని తెలిపారు. అదే విధంగా జగ్గయ్యపేట మండలంలో 35.4 మి.మీల వర్షపాతం నమోదు కాగా పెనుగంచిప్రోలు మండలంలో 14.6 మి.మీ, వత్సవాయి మండలంలో 38.4 మి.మీల వర్షపాతం నమోదైనట్లు చెప్పారు.

28న గన్నవరంలో జాబ్‌మేళా

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈ నెల 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన పదికి పైగా ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించేనున్నట్లు పేర్కొన్నారు. ఏడు నుంచి పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ ఉత్తీర్ణులైన యువతీ, యువకులు జాబ్‌మేళాకు అర్హులుగా తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్ పత్రాలు, ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం 94940 05725, 63006 18985 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

శిథిల భవనాల్లో భయం భయం

- శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలు
- కొద్దిపాటి వర్షానికే తహసీల్దార్ కార్యాలయంలోకి చేరుతున్న నీరు
- మూలపాడు పశువైద్యశాలదీ అదే పరిస్థితి
- భయం భయంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు



ఇబ్రహీంపట్నంలో శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయం



దుస్థితిలో గ్రామీణ రక్షిత నీటి సరఫరా శాఖ భవనం

ఇబ్రహీంపట్నం: మండలంలోని ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. కొద్దిపాటి వర్షానికి నీటి ముంపునకు గురికావడంతో పాటు పెచ్చులూడిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. సరైన సమయంలో మరమ్మతులు చేపట్టకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేని కారణాలతో అనతి కాలంలోనే భవనాలు శిథిలావస్థకు చేరాయి.

కొద్దిపాటి వర్షానికే..

మండల పరిషత్, మండల తహసీల్దార్ భవనాలు నీటిముంపునకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. తహసీల్దార్ కార్యాలయం గదుల్లోకి నీరు చేరడం వలన ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మూలపాడు పశు వైద్యశాల, ఇబ్రహీంపట్నం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం సైతం శిథిలమై ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు పనికిరాకుండా పోయాయి. గతేడాది ఆగస్టులో వచ్చిన వర్షానికి కార్యాలయాల ప్రాంగణంలోకి భారీగా వర్షంనీరు చేరి ఐదురోజుల పాటు నీటిముంపులో ఉన్నాయి. గత సోమవారం రాత్రి కురిసిన వర్షానికి తహసీల్దార్ కార్యాలయంలోకి భారీగా వర్షం నీరు చేరింది. ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు ఆటంకం ఏర్పడింది. ఎంపీపీ కార్యాలయం చుట్టూ వర్షం నీరు చేరడంతో ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చిన ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

భవనం కింద నీరు..పైన విధులు..

కొద్దిపాటి వర్షానికి తహసీల్దార్ కార్యాలయం నీటి ముంపునకు గురికావడంతో తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు భవనంపైన చెట్టు నీడలో విధులు నిర్వహించాల్సి వచ్చింది. భవనం చుట్టూ రెండు అడుగుల ఎత్తులో రోడ్లు ఉండటంతోనే సమస్య.

అభద్రతా భావంలో ఉద్యోగులు..

ప్రజల సౌకర్యార్థం ఎంపీపీ, మండల తహసీల్దార్, విద్యాశాఖ, స్త్రీశక్తి భవనం, ఉపాధి హామీ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, గృహనిర్మాణ, వ్యవసాయ శాఖల భవనాలు ఒకే ప్రాంగణంలో నిర్మించారు. కొద్దిపాటి వర్షానికి ఈకార్యాలయాలు నీటిముంపునకు గురవుతున్నాయి.

ఆర్‌డబ్ల్యూఎస్, పశువైద్యశాల.

మూలపాడులో పశువైద్యశాల అనతి కాలంలోనే శిథిలావస్థకు చేరింది. నాలుగు గదుల భవనంలో స్లాబు పెచ్చులూడిపోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. వర్షం వస్తే మూడు గదుల్లో నీరు చేరుతుంది. పర్వాలేదనిపించే ఓగదిలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఆర్‌డబ్ల్యూఎస్ భవనం కూడా శిథిలమై సుమారు పదేళ్లు అవుతోంది. మూడేళ్ల వరకు ఆభవనంలోనే విధులు నిర్వహించారు. ఇటీవల ఆభవనం స్టాక్ రూమ్‌గా మార్చారు.



నూతన భవనం నిర్మించాలి

మండల ప్రజల అవసరాలు తీర్చే తహసీల్దార్ కార్యాలయం ప్రతిసారి నీటి ముంపుకు గురవుతోంది. ఉద్యోగులు అభద్రతాభావంతో పనిచేయాల్సి వస్తుంది. ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సౌకర్యార్థం నూతన భవనం నిర్మించాలి.

– పల్లె నరేష్, ఇబ్రహీంపట్నం



నిధులు మంజూరు చేయాలని కోరాం

తహసీల్దార్, ఎంపీపీ కార్యాలయాల ప్రాంగణం లోతట్టు ప్రాంతంగా మారింది. కొద్దిపాటి వర్షానికి నీటిమయం అవుతోంది. భవనం కిందకు ఉన్నందున గదుల్లోకి నీరు వస్తోంది. కలెక్టర్ లక్ష్మీశను నిధులు మంజూరు చేయాలని కోరాం.

– వై.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం

డీఎస్సీ- 2025 పరీక్షలకు మోడల్ గ్రాండ్ టెస్ట్‌లు

మైలవరం: డీఎస్సీ- 2025 పరీక్షలకు హాజరుకాబోయే ఉపాధ్యా అభ్యర్థులకు పీఆర్టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మోడల్ గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహించబోతున్నట్లు పీఆర్టీయూ మైలవరం మండల శాఖ అధ్యక్షుడు, అసోసియేట్ అధ్యక్షుడు పీ గోపాల్, సతీష్ కుమార్‌లు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని స్థానిక విద్యావనరుల కేంద్రంలో మండల శాఖ అధికారి బాలు ఆవిష్కరించారన్నారు. ఈ సందర్భంగా మైలవరంలో శిక్షణ తీసుకుంటున్న డీఎస్సీ అభ్యర్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు గోపాల్, సతీష్‌కుమార్ తెలిపారు.

మజ్జిగ పంపిణీ



మైలవరం: మండల పరిధి వెల్వడం గ్రామంలోని లకిరెడ్డి పాపులమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987- 1992 సంవత్సరాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో గురువారం మజ్జిగ పంపిణీ చశారు. గత రెండు నెలలుగా పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో కూలింగ్ వాటర్‌ను పంపిణీ చేశామని విద్యార్థి సంఘం నాయకుడు గూడూరు నాగిరెడ్డి తెలిపారు. హనుమత్ జయంతి సదర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. బొగ్గుల కిశోర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన రెండవ కుమారుడు బొగ్గుల వెంకట శ్రీనివాసరెడ్డి, కృష్ణవేణి దంపతుల సహకారంతో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి





విస్సన్నపేట ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో భక్తులు; వెల్లటూరు వేణుగోపాలస్వామి, ఆంజనేయుని ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం

జి.కొండూరు: హనుమాన్ జయంతిని మండల పరిధిలోని అన్ని ఆంజనేయస్వామి దేవాలయాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. వెల్లటూరు వేణుగోపాలస్వామి, ప్రసన్నాంజనేయస్వామి, ప్రపర్తి ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆలయ అర్చకుడు కోమారి లక్ష్మీనారాయణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారికి పంచామృత స్నపన, అలంకార విశేషార్చన, బజన, భక్త బృందంచే హనుమాన్ చాలీసా పారాయణం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. జి.కొండూరు, మునగపాడు ఆంజనేయస్వామి దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి వేడుకలు

తిరువూరు: హనుమజ్జయంతి వేడుకలు తిరువూరు నియోజకవర్గంలో గురువారం నిర్వహించారు. తిరువూరు స్వామి అయ్యప్ప దేవాలయంలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారికి తమలపాకులతో పూజలు, పంచామృత అభిషేకాలు, క్షీరాభిషేకాలు జరిగాయి. కోదండరామాలయంలో, పాటిమీద దాసాంజనేయ స్వామి ఆలయం, రాజుపేట, చీరాల సెంటర్ ఆంజనేయ స్వామి దేవాలయాలలో విశేష పూజలు, హనుమాన్ చాలీసా పారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.



మైలవరంలో ఆంజనేయస్వామి విగ్రహానికి పూలతో అలంకరణ

మైలవరంలో వేడుకలు

మైలవరం: మైలవరంలో శ్రీహనుమాన్ జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ద్వారకా తిరుమల దేవస్థానం దత్తత దేవాలయం నూజివీడు రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. ద్వారకా తిరుమల దేవస్థానముల చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో జూలూరు పాపయ్య, ప్రత్తి సాయి దాశరథి తదితర భక్త బృందం పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. మైలవరంలోని సీతారామాంజనేయస్వామి ఆలయం, నూజివీడు రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయం, తిరువూరు రోడ్డులోని భక్తాంజనేయ స్వామి(మారుతీ కల్యాణ మండప ప్రాంగణం) ఆలయంలో శ్రీహనుమత్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆంజనేయస్వామి వారిని పూలతో అలంకరించారు.

ఆగిరిపల్లి: మండలంలోని హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆగిరిపల్లిలోని శోభనాచలస్వామి ఆలయంలో యోగాంజనేయ స్వామికి తమల పత్రార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రామకృష్ణ భజన మందిరంలో వరాహ పుష్కరిణి వద్ద ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఆంజనేయునికి విశేష పూజలు చేశారు. నెక్కలం గొల్లగూడెం, వట్టిగుడిపాడు సెంటర్ రామాలయంలో, వడ్లమానులో, ఈదులగూడెంలో చొప్పరమెట్లలో ఆంజనేయస్వామికి భక్తులు పూజలు నిర్వహించారు. రామకృష్ణ భజన మందిరంలో రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు.

ముఖద్వారం ప్రారంభం

చాట్రాయి: మండలంలోని గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. సూరంపాలెం, చాట్రాయి, చిన్నంపేట, సి-గుడిపాడు, కోటపాడు, చీపురుగూడెం గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ చాలీసా నిర్వహించి అన్నదానాలు చేశారు. సూరంపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి ఆలయ ముఖ ద్వారాన్ని గ్రామస్తులు ఘనంగా ప్రారంభించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: హనుమజ్జయంతి వేడుకలు విస్సన్నపేటలో గురువారం జరిగాయి. మండలంలోని పలు రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో తెల్లవారుఝాము నుంచి ఆంజనేయస్వామికి తమలపాకు పూజలు, అష్టోత్తర శతనామాలతో పూజాదికాలు నిర్వహించారు. పంచామృతాలతో, పాలతో స్వామివారికి అభిషేకించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయస్వామికి వడమాలలు, గారెల దండలు సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ముసునూరు: ఆంజనేయస్వామి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి స్వామికి అభిషేకాలు విశేష పూజాదికాలు నిర్వహించి, భజనలు చేశారు. లోపూడి, చెక్కపల్లి, ముసునూరు సిల్క్‌నగర్, గోగులంపాడు, గోపవరం, కాట్రేనిపాడు, వేల్పుచర్ల తదితర గ్రామాల్లో వేలాదిగా భక్తులు హాజరై ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో సువర్చలాంజనేయ శాంతి కల్యాణం, భక్తులకు అన్నదానాలు నిర్వహించారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు,రాజకీయ ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలకు భక్తులు వేలాదిగా హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



మైలవరం నూజివీడు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు



తిరువూరు పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయంలో భక్తులు



లోపూడిలో పూజలందుకుంటున్న భక్తాంజనేయస్వామి

చెత్త నుంచి సంపద తయారీతో ఆదాయం



పోతవరప్పాడులో చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌జేసీ జిల్లా కో ఆర్డినేటర్ ప్రసంగరాజు

ఆగిరిపల్లి: చెత్తతో సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని డీపీఆర్‌జేసీ జిల్లా కో ఆర్డినేటర్ ప్రసంగరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త సేకరణ ద్వారా తడి, పొడి చెత్తను వేరుచేసి ఆ వ్యర్థం నుంచి ఎరువులను తయారు చేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని తెలిపారు. అనంతరం ఆగిరిపల్లి, పోతవరప్పాడులోని చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించారు. చెత్త ద్వారా వర్మీకం పోస్టును ఎలా తయారు చేయాలో క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్ బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రహ'దారుణం'



కందులపాడు గ్రామంలో భారీ గొయ్యిలతో రహదారి



వెల్లటూరు గ్రామంలో చెరువును తలపిస్తున్న రహదారి



ఆర్‌అండ్‌బీ రోడ్డుపై చెరువును తలపిస్తున్న నీటి కుంట

జి.కొండూరు: మండలంలోని కందులపాడు గ్రామం నుంచి మైలవరం మండల పరిధి గణపవరం వరకు ఉన్న ప్రధాన రహదారి భారీ గోతులతో చెరువులను తలపిస్తోంది. ఈ రహదారిలో ఇటుక బట్టీలకు ముడి సరుకు రవాణా చేసే వాహనాలు, ఇటుకల లోడుతో రాకపోకలు సాగించే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. మైలవరం వైపు నుంచి గణవరం, వెల్లటూరు, కందులపాడు, వెలగలేరు గ్రామాల మీదుగా విజయవాడ వైపు వెళ్లేందుకు ఈ రహదారి షార్ట్‌కట్. అధిక రద్దీతో ఈ రహదారి కందులపాడు, వెల్లటూరు గ్రామాలలో పూర్తిగా ధ్వంసమై అధ్వానంగా మారింది. గతంలో ఒక సారి పూడ్చినా యథా స్థితికి చేరింది. రహదారి విస్తరణ పనులకు నిధులు మంజూరైనప్పటికీ టెండర్ వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావటంలేదని తెలుస్తోంది. అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులను తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్లు

చాట్రాయి: నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఆర్‌అండ్‌బీ రోడ్లు నీటి గుంటలతో చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో ఇటీవల చేపట్టిన ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతుల్లో పెద్ద పెద్ద గోతులు పూడ్చకుండా వదిలేయడంతో వర్షం కురిసి నీటి కుంటలుగా దర్శనమిస్తున్నాయి. పర్వతాపురం నుంచి చిన్నంపేట, చాట్రాయి సెంటర్ నుంచి బూరుగుగూడెం వరకు చాలా గోతులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంటల్లో నీరు నిలిచి వాహన చోదకులకు ప్రాణ సంకటంగా మారుతున్నాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లపై ఏర్పడిన గుంటలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

పత్రికా ప్రకటన

నా క్లయింటుమ్మా, విస్సన్నపేట మండలం, విస్సన్నపేట గ్రామకాపురస్తుడు తొర్లికొండ చిన్నవీరాస్వామి గారి కుమారుడు 1) వెంకటేశ్వరరావు, డిటో గ్రామ కాపురస్తుడు దేశ్ళ రంగారెడ్డి గారి కుమారుడు 2) సత్యనారాయణ రెడ్డి నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యిందుమూలముగాయావన్మందికి తెలియజేయునది నా క్లయింట్లు నిమ్మకూరి భాస్కరరావు గారి కుమారుడు నిమ్మకూరి సురేష్‌కు చెందిన విస్సన్నపేట పంచాయితీ, విస్సన్నపేట గ్రామములో ఈ దిగువ షెడ్యూలులో ఉదహరించిన నివేశన స్థల ఆస్తిని క్రమమైన ప్రతిఫలమునకు కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని యున్నారు. సదరు విషయములో ఎవ్వరికైనా ఎటువంటి అభ్యంతరములు వున్న యెడల ఈ ప్రకటన జారీనుండి ఒక వారము రోజులలోగా తమ అభ్యంతరములను లిఖితపూర్వకముగా తెలియచేయగలరు. లేని యెడల దస్తులా వచ్చే అభ్యంతరాలకు నాక్లయింట్లుకు ఎట్టి బాధ్యత లేదని తెలియపర్చడమైనది.

షెడ్యూలు

యన్.టి.ఆర్.జిల్లా, విస్సన్నపేట సబ్ రి., విస్సన్నపేట మండలం, విస్సన్నపేట గ్రామములోని ఆర్.ఎస్.నెం. 558/2 దాఖలా 188.8 చ.గ.ల ఖాళీ నివేశనస్థలమునకు హద్దులు తూర్పు: నండిపాం వరదానమ్మ గారి ఇల్లు దక్షిణం: మేకపాం ఆశీర్వాదం గారి భూమి పడమర: మేకపాం ఆశీర్వాదం గారి భూమి ఉత్తరం: ఆర్. అండ్.బి. రోడ్డు

తిరువూరు, దేగళ్ళ మోహనరెడ్డి, న్యాయవాది,
ది.22.05.2025. తిరువూరు. సెల్: 9490333224

● వాహనాల వేలం

జగ్గయ్యపేట: సర్కిల్ పరిధిలో మద్యం కేసుల్లో పట్టుబడ్డ వివిధ వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ. 23 లక్షల ఆదా యం సమకూరిందని సర్కిల్ ఎక్సైజ్ సీఐ బి. గురవయ్య తెలిపారు. తొర్రగుంటపాలెం ఎక్సైజ్ కార్యాలయం వద్ద గురువారం మద్యం కేసుల్లో పట్టుపడ్డ 12 వాహనాలకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందన్నారు. కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు

గ్రావెల్ అక్రమ తరలింపుపై విచారణ



కొంగరమల్లయ్య గట్టు వద్ద విచారణ చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ పోసుబాబు

గట్టుభీమవరం(వత్సవాయి):మండలపరిధిలోని గట్టుభీమవరం, వత్సవాయి రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న కొంగరమల్లయ్య గట్టు, వేములనర్వ పరిధిలో గట్టు నుంచి అక్రమ మైనింగ్‌పై అందిన ఫిర్యాదు మేరకు విజయవాడ డెప్యూటీ కలెక్టర్ పోసుబాబు గురువారం విచారణ నిర్వహించారు. ముందుగా కొంగరమల్లయ్య గట్టు సర్వే నంబర్ 277/1 లో ప్రభుత్వం ఇచ్చిన అనుమతులకు మించి జరిగిన గ్రావెలింగ్‌పై కొలతలు తీశారు. ప్రభుత్వం ఇచ్చిన మేరకే గ్రావెలింగ్ జరిగిందా, అదనంగా జరిగిందా అన్నదానిపై విచారణ చేశారు. అదేవిధంగా వేములనర్వ గుట్ట వద్ద సర్వే నంబర్ 213 లో 5.68 ఎకరాల భూమిని సాగుచేసుకునేందుకు ఏడుగురు రైతులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే ఆ భూమిలో రైతులు సాగుచేసుకోకుండా గ్రావెల్‌ను అక్రమంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని వత్సవాయికి చెందిన మందడపు రామారావు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయగా దానిపై విచారణ నిర్వహించి రైతుల నుంచి రాతపూర్వక నివేదిక తీసుకున్నారు. విచారణలో వెల్లడైన అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ రూరల్ తహసీల్దార్ సుగుణ, భీమవరం, చిల్లకల్లు వీఆర్వోలు జి స్వామి, ఎస్‌కే హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.